# విష్ణు మాయ!

వైకుంఠంలో శ్రీమహావిష్ణువు శేషసాయిపై పవ్వళించి యోగ నిద్రలో వున్న వాడికి సడన్‌గ మెలుకువ వచ్చిన కారణాన పకపకా పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వటం మొదలుపెట్టాడు.

అసంకల్పిత చర్యకు శ్రీమహాలక్ష్మి దిగ్భ్రాంతి చెంది 'ఏం స్వామీ నవ్వు చుంటిరి...' ప్రశ్నించింది.

'అటు చూడుము దేవీ! భూలోకాన గల భారత దేశంలో వున్న అం.ప్ర రాష్ట్రంలో తిరుమల పవిత్ర క్షేత్రంగ పిలవబడే శ్రీవేంకటేశ్వరుని దేవాలయంలో గర్భగుడిలో వుండు స్వామివారి మూలవిరాట్ విగ్రహం మాయమైనందుకు భక్తులు గగ్గోలు పెడుతున్నారు....'

'అదేమిటి స్వామీ తమరు అలా శెలవిస్తున్నారు?'

'ఈ వార్త దేశవ్యాప్తంగ అన్ని భాషల దిన పత్రికలలో... టీ.వీ. ఛానళ్లలోనూ ప్రసారం కూడా అగుచున్నది. కాంచుచుంటివా?-'

ఈ సెన్సేషన్ న్యూస్‌కి యావత్ భారతం వేంకటేశ్వరుని మూలవిరాట్ ఎలా?ఎందుకు? అదృశ్యమైనదో వూహకందక మల్లగుల్లాలు పడుతున్నారు. రెండు వేల పన్నెండులో రాబోవు ప్రళయానికిది సంకేతమేమోనని భయ భ్రాంతులవుతున్నారు.

దేవస్థానం అధికారగణంలో కలవరం... బిత్తరపోయిన ప్రభుత్వం ఏం చేయాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు.

మూలవిరాట్ అదృశ్యం అంతుచిక్కని మిస్టరీ అయింది! టెర్రరిస్టులు స్వామివారి విగ్రహాన్ని తలరించుకుపోయారా? అయినా... అదెలా సాధ్యం? ఎందరో సుశిక్షుతులైన సిబ్బంది రెప్పవేయక ఆలయ ప్రాంగణాన్ని భక్తి శ్రద్ధలతో కాపలా కాస్తున్నారు కదా? ఇది నాస్తిక బృందాలమాయోపాయమా? లేక... విద్రోహ చర్యా?... పరాయి దేశస్తులు తను కుటిల పన్నాగముతో నేటి ఆధునిక టెక్నాలజీని వుపయోగించి రాత్రికి రాత్రి అత్యంత రహస్యంగా దాడిచేసి అమెరికా వారు బిన్ లాడెన్‌ను హతమార్చిన విధంగా వెంకటేశ్వరుని మూలవిరాట్‌ను తస్కరించుకుపోలేదు కదా?-

స్వామి వారి విగ్రహం గురించి అన్వేషణ మొదలైంది. గాలింపు చర్యలు

ప్రారంభమైనయ్. ఇంటర్‌పోల్ సాయాన్ని కూడా తీసుకోవటానికి భారతప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేంకటేశ్వరుని మూలవిరాట్ రాతి విగ్రహ అపహరణ (అదృశ్యం) గురించి యావత్ ప్రపంచానికీ తెలిసిపోయింది.

స్వామి లేని ఆలయం చిన్నపోయింది. గుడి తలుపులు మూసేసి తాళాలు బిగించటంతో భక్తుల రాక లేక తిరుమల నిర్మానుష్యంగ మారింది. అక్కడి సత్రాలు... కాటేజీలు వెలవెలపోతున్నయ్. అధినేతలకు... నేతలకు... నాయకులకు... బడా వ్యాపారులకు... సినీ నటులకు... ఇంకా అనేక మందికి స్వామివారి దర్శనం లేకపోయినందుకు చింతాక్రాంతులైరి.

టాక్స్‌లు ఎగగొట్టి బ్లాక్‌లో వున్న డబ్బుతో అవినీతితో సంపాదించిన ఆదాయంతోను స్వామివారికి బంగారు నగలు... నవరత్నఖచిత పసిడి కిరీటాలు చేయిస్తే... స్వామి ఇంటిమేషన్ లేకుండా వుడాయించినందుకు ఖరీదైన భక్తులు ఘొల్లుమన్నారు. చేయించిన నగలు పోయె.... స్వామి దర్శనం చేసుకునేటందుకు గుడిలో విగ్రహమూ లేకపోయె అనేసి వాపోయారు.

ఘాట్‌రోడ్లపై రద్దీలేక బోసిపోయినయ్. అడవి జంతువులు విచ్చలవిడి స్వైరవిహారం చేస్తున్నయ్. ఎర్ర చందనాన్ని యేథేచ్ఛగా దోచుకుంటున్నారు స్మగ్లర్లు!

స్వామి వారికి నెయ్యి, జీడిపప్పు కిస్‌మిస్ వంటి ఇతర సుగంధ దినుసులు అత్యంత ఖరీదుకు సప్లై చేసి వేంకటేశ్వరుని సొమ్ముదండుకునే వ్యాపారులు నిరాశతో దు:ఖించిరి!

ఆలయ అర్చక స్వాములకు పనిలేకుండాపోయె! డాలర్లు కాజేసి దొంగతనంగా అమ్మి సొమ్ము చేసుకునే అవకాశం లేకుండాపోయె!

కళ్యాణ కట్ట వెలవెలపోతోంది! క్షురకులకు పనిలేకపోవటాన భక్తుల గుండు గొరగటానికి ఏడిపించి వసూలు చేసి దాచిన సొమ్ముతో కాలంగడుపు తుండిరి!

అక్కడి వుద్యోగులందరికీ వాలెంటరీ రిటైర్మెంట్ ఇచ్చి వారిని ఇళ్లకు పంపించివేసిరి!

ఇదేదో మంచికి రాలేదు! అశుభానికి సంకేతం కాబోలు! పాపకృత్యాలు మితిమీరి నందువల్లే స్వామి వాటిని వీక్షించలేక అదృశ్యమై వుంటాడని అనేకులు వగచుచుండిరి.

తిరుమల కొండ అపవిత్రతకు నిలయమైపోయింది. వ్యభిచారం... మందు బాబులకు నిలయం కావటం... భక్తులను అనేక రకాలుగా మోసం చేయటం చూడలేక... చూచి సహించలేక... మాంసవిక్రయాలను అడ్డుకోలేక దేవుడు అదృశ్యమై వుంటాడని మరి కొంతమంది భక్తులు వాపోయిరి! దర్శించుకునే భాగ్యం కరువైనందుకు అనేకులు దుఃఖించిరి!

ఏనాడో బ్రహ్మంగారు సెలవిచ్చినట్టు... ఇది దైవానికి కోపమొచ్చి... ఆగ్రహించి... మానవజాతిని శిక్షించాలని నిర్ణయించుకునే సడన్‌గ అదృశ్యమై వుండనోపు అని అనేకులు భావించిరి!

ఏం చేటు సంభవించనున్నదో?... ఏం వుపద్రవం రానున్నదో?... అందుకే ఈ సునామీలు... భూకంపాలు... మోసాలు... దగా... అవినీతి... మానభంగాలు... పట్టపగలే దోపిడీలు... భూదండాలు... పబ్లిగ్గా నరుక్కోవటాలు... మహిళలను వేధించటం వంటి అకృత్యాలు జరుగుతున్నందునే మూలవిరాట్ మాయమైంది.

నో డౌట్!! మరో డూప్లికేట్ విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించేందుకు స్వామీజీలు... మఠాధిపతులు... మతోన్మాదులు అంగీకరించలేదు. నిరసనగళాలు దేశ వ్యాప్తంగ విన్పించటంతో ఆ ప్రతిపాదనకు స్వస్తి పలక్క తప్పలేదు.

× × × × ×

తిరుమల దేవాలయంలో గల శ్రీవెంకటేశ్వరుని విగ్రహం అదృశ్యమగుట గురించి ఆనోట ఆనోట... చివరికి నారదుని చెవికి సోకింది.

నారద మునీంద్రుడు సుడిగాలి వేగంతో శ్రీమహా విష్ణువు ముందుకొచ్చి వాలాడు..

'స్వామీ! ఎంత ఘోరం జరిగినది?... నమ్మలేకున్నాను' విలపిస్తూ అన్నాడు నారదుడు.

'నువ్ నన్ను ప్రశ్నలతో వేధించి చంపక నే చెప్పేది నువ్వూ లక్ష్మీ దేవితో పాటు వినుము... దేవీ! ఎక్కడ ఆగేను... ఆఁ! గుర్తుకొచ్చినది... మీకెవ్వరికీ చెప్పకుండా ఇటీవలే ఒకసారి మానవరూపము దాల్చి తిరుమల కొండకెళ్లాను! నేరుగా కళ్యాణకట్టుకెళ్లి ఓ క్షురకుని సమీపించిన నన్ను ఎగాదిగా పరీక్షించి తలనీలాలు స్వామీ వారికి సమర్పించవలెనన్న టిక్కెట్టు తెచ్చుకోమని చెప్పెను. గుండు

చేయించుకొనుటకు టిక్కెట్టా? అనుకుని టిక్కెట్టుతో వచ్చి క్షురకర్మ చేయమనగ... క్షురకుడు నానుండి అదనంగ ధనాన్ని ఆశించాడు. అందరూ ఇస్తూండగనేనెందుకు కోపగించుకొనవలెనని అతనికి పదిరూపాయలు లంచమిచ్చితి పని పూర్తిచేసుకుని... స్నానమాచరించుటకై దగ్గరలో గల పుష్కరిణి కోనేటిని చేరుకుని నీటిలో మునగగా నీటి దుర్వాసనకు తట్టుకొనలేకపోతిని. దుర్గంధ భూయిష్ఠముగ నున్న కోనేటిలో గల నీటిని ఎందు శుభ్రపరచలేదో భోధపడలేదు.

'ఆతర్వాత ఏమైంది నారాయణా?-' నారదుడడిగెను

'అవును స్వామీ... చెప్పండి... మీకేమైనా అచ్చట అవమానము జరిగినదా?' లక్ష్మీదేవి ఆత్రంగ అడిగింది.

'శ్రీనివాసుని దర్శనానికి ఆలయములోకి పోవ ప్రయత్నించ నన్ను అక్కడి సిబ్బంది అడ్డుకుని... ధర్మదర్శనముకై క్యూ కాంప్లెక్స్‌లో నిలబడి లోనికి రావలెనని... లేనిచో తగిన రుసుము చెల్లించి టిక్కెట్టుకొని లోనికి వెళ్లవలెననిరి.'

'ఇది ఏమి అన్యాయము దేవదేవా?- నిన్నా విధంగా అవమాన పరిచిరా మానవులు?-' రోషపడ్డాడు నారదుడు.

'దేవుని పేరు చెప్పి ఈ విధముగ టిక్కెట్ల కొనుగోలు విధానము ప్రవేశ పెట్టుట నాకు బొత్తిగా నచ్చలేదు. అంతేకాదు లక్ష్మి... దైవ ప్రసాదాన్ని డబ్బుకు అమ్ముతున్నారు. క్యూలో వున్నావారు. స్వామివారి దర్శనానికై గంటల తరబడి నిలబడి నిరీక్షిస్తూంటే... వి.ఐ.పీల అనబడే పెద్దలు రాజకీయ నాయకులు... అధికార అనధికారులు రికమెండేషన్‌తో నేరుగా సింహద్వారం నుండి లోనికెళ్లి క్షణాల్లో దర్శనం ముగించుకొస్తున్నారు. కొండపై జరుగుతున్న అక్రమాలు... అన్యాయాలు కళ్లారా చూచి సహించలేకపోయాను. అంతేకాదు నారదా... స్వామి వారి ప్రసాదమైన లడ్డు తయారుచేయుటలోనూ నిర్లక్ష్యమే! మేకులు... గాజు ముక్కలు.. బోల్టులవంటివి చోటు చేసుకొనుట తయారీదారుల అజాగ్రత్తకు నామనసు చివుక్కుమన్నది. అచ్చటి వారిని క్షమించుట ఎటుల?- తిరుమల వంటి పవిత్ర ప్రదేశములో వివరించలేని ఘోరాలు ఎన్నెన్నో జరుగుతున్నవి! నిఘా విభాగాల వైఫల్యం... అధికారుల అలసత్వం... దేవుని సొమ్ము దుర్వినియోగం వంటివి యధేచ్ఛగా సాగుతున్నయ్. రాజకీయాల ప్రాబల్యం అధికంగా వున్నది! దేవుడు అందరివాడనే వాస్తవాన్ని

విస్మరించి ఎవరికి దక్కినంత వారు మెక్కుతున్నారు. ఆలయం దోపిడీకి గురవటం కన్నులారా కాంచి హర్షించలేకపోయాను.- దుర్మార్గులకు గుణపాఠం చెప్ప నిర్ణయించుకున్నాను...'

'మానవులు ఎంతటి నైచ్యమునకు పాల్పడుచున్నారో... మీరు చెప్పగా వింటూ నివ్వెరపోతుంటిని స్వామీ...' నారదుడు నిట్టూర్చాడు.

'ఆదాయం ఎక్కడుండునో... అవినీతి పాపకార్యాలు అచ్చటనే వుండును నాధా!...'

'అందుకే మానవులకు చక్కని గుణపాఠం నేర్పవలెనని... శ్రీనివాసుని మూల విరాట్ విగ్రహాన్ని నేనే మాయం చేసితిని... వారి తప్పిదాలను వారు తెలుసుకోవాలి! మిగతా ఆలయాల పరిస్థితి చక్కబడాలి! అన్యాయాలు అక్రమాలు తొలిగిపోవలె! పరిస్థితి మెరుగుపడినదని నాకు అన్పించిన క్షణాన తిరిగి శ్రీనివాసుని మూలవిరాట్ విగ్రహాన్ని తిరుమల ఆలయంలో పునఃప్రతిష్ఠ స్వయంగా నేనేగావించెదను!!-'

'మీ నిర్ణయం సరైనదే దేవదేవా! అటులనే చేయండి. అప్పుడుగాని మానవులకు బుద్ధి రాదు...' లక్ష్మీదేవి నారదులవారు ముక్త కంఠంతో అన్నారు.

(సమాప్తం)